అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లను వినిపిస్తున్న వేముల. చిత్రంలో బాజిరెడ్డి

రేవంత్‌పై రైతులు తిరగబడాలి

- దేవుళ్లపై దొంగ ఒట్లు వేసి అబద్ధాలాడుతున్న మూర్ఖుడు
- రుణమాఫీలో అర్హులకు అన్యాయం
- హరీశ్ సవాల్‌తోనే ఆ మాత్రం రుణమాఫీ: వేముల
- ఉచిత బస్సు బకాయిలు 2వేల కోట్లు : బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, ఆగస్టు 16, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సంస్కారం, మానవత్వం లేదు. దేవుళ్లపై ఒట్టేసి అబద్ధాలాడుతున్న మూర్ఖుడు ఆయన' అంటూ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు.రూ.2లక్షల్లోపు రుణాలు ఒకేసారి మాఫీ చేస్తామని ఎన్నికల్లో కల్లబొల్లి వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక రైతులను రేవంత్‌రెడ్డి నిలువునా ముంచారని, ఆయనపై రైతులు, ప్రజలు తిరగబడాలని, ఎక్కడికక్కడ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి వేములు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ చేయక ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 2లక్షల 4వేల మందిని వంచించారని, అర్హులైన రైతుల నోట్లో మట్టికొట్టారని విమర్శించారు. కాంగ్రెస్ తీరును ఎండగడుతూ నేడు బాల్కొండ నియోజకవర్గ రైతులతో కలిసి వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ధర్నా చేయనున్నట్టు ప్రకటించారు. రేవంత్‌రెడ్డి భాషను చూస్తుంటే అసహ్యం వేస్తున్నదని మండిపడ్డారు. వంద రోజుల్లో హామీలు అమలు చేయనందున తక్షణం సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైరా సభలో ప్రసంగం చూస్తుంటే మెదడు చితికి మానసిక రుగ్మతలతో రేవంత్ బాధపడుతున్నట్టు తెలుస్తున్నదని ఎద్దేవాచేశారు. రుణమాఫీ చేయకుండా ఉల్టాచోర్ కొత్వాల్‌కే డాంటే అన్నట్టుగా రేవంత్ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం చెప్తున్న అబద్ధాలకు అబద్ధమే ఆత్మహత్య చేసుకుంటుందని ఎద్దేవాచేశారు. హరీశ్ సవాల్‌తోనే ఈ మాత్రం రుణమాఫీ అయినా జరిగిందని, లేదంటే ఇది కూడా అమలుకాకపోయేదని గుర్తుచేశారు.

43వేల మంది కార్మికుల జీవితాలు అగమ్యగోచరం: బాజిరెడ్డి గోవర్ధన్

ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీకి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.2వేల కోట్ల బకాయిలు పడిందని ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ప్రతి నెలా బకాయిలను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పి తీరా నిధులు కేటాయించక పోవడంతో 43వేల మంది కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని చెప్పారు. ఆర్టీసీ కార్మికులకు సమయానికి జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని వివరించారు. మహిళలను కించపరిచారంటూ కేటీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వితంతువులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు రూ.4వేల పింఛన్ అమలు కావడం లేదని, మహిళలకు రూ.2500 ఇవ్వడం లేదని, యువతులకు స్కూటీలు ఇస్తామని చెప్పి 8 నెలలుగా మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డిని ఆడబిడ్డలంతా నిలదీయాలని పిలుపునిచ్చారు. మహిళలకు రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సుజిత్ సింగ్ ఠాకూర్, సిర్ప రాజు, రవిచంద్ర, దండు శేఖర్, సత్య ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, కేపీ వివేకానంద

..నిరూపిస్తే రాజీనామా

మొదటిపేజీ తరువాయి...

రూ. 31 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పారని, బడ్జెట్‌లో మాత్రం 26 వేల కోట్లు చూపించి.. 17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి అంకెల గారడీ చేశారని విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్‌తో కలిసి కేటీఆర్ మాట్లాడారు. సెక్యూరిటీ లేకుండా రేవంత్‌రెడ్డి జనంలోకి వెళ్తే పుట్‌బాల్ ఆడుకుంటారని పేర్కొన్నారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసినందుకు ఆయనపై చీటింగ్ కేసు పెట్టాలని పేర్కొన్నారు. అర్హులైన వారిలో సగం మందికి కూడా రుణమాఫీ కాలేదని తెలిపారు. ఇంత దిగజారుడు ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదని పేర్కొన్నారు.

నిబంధనల పేరుతో కటింగ్‌లు

ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రం కొందరికే చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల పేరుతో రుణమాఫీలో కటింగ్‌లు పెట్టి సీఎం కాస్తా కటింగ్ మాస్టర్‌గా మారిపోయారని ఎద్దేవా చేశారు. 60 శాతం మందికి ఎగ్గొట్టి, 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి మోసం చేశారని దుయ్యబట్టారు. మార్పుమార్పు అంటూ రైతన్నలను మోసం చేశారని దుయ్యబట్టారు. 2 లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ. 2500, జాబ్ క్యాలెండర్, ఆటో అన్నలకు సాయం, వృద్ధులకు రూ. 4వేలు అన్నీ మోసమేనని మండిపడ్డారు.

ఫ్రస్ట్రేషన్‌తో రంకెలు

రైతుల గొంతును రేవంత్‌రెడ్డి తడిగుడ్డతో కోస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వానకాలానికి ఇవ్వాల్సిన రైతు భరోసాను ఎగ్గొట్టారని, ఆగస్ట్ సగం నెల గడిచినా ఇంకా ఇవ్వలేదని మండిపడ్డారు. యాసంగిలోనూ రైతు భరోసా ఇవ్వలేదని పేర్కొన్నారు. తాము రైతులకు లక్షకోట్లు ఇస్తే ఈ ప్రభుత్వం 17 వేల కోట్లే ఇచ్చిందని చెప్పారు. రేవంత్ ఫుల్‌ఫ్రస్ట్రేషన్‌తోనే తమపై రంకెలేశారని పేర్కొన్నారు. తనకంటే కుటుంబసభ్యులు దూసుకెళ్తున్నారని, భట్టి విక్రమార్క ఎక్కువ తిరుగుతున్నాడని, అధిష్ఠానం పట్టించుకోవడం లేదని బాధవల్లే అలా ఫ్రస్ట్రేషన్‌కు గురైనట్టు తెలుస్తున్నదని ఎద్దేవా చేశారు.

రేవంత్ మానసిక స్థితిపై అనుమానం

రేవంత్‌రెడ్డి మానసిక స్థితిపై కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. గొడన్నులు కల్లులో నీళ్లు ఎన్ని కలుపుతారో అంటాడని, ప్రైవేటు టీచర్లు ఫెయిలయ్యే వాళ్లంటాడని, మహిళలను కించపరుస్తాడని, భాక్రానంగల్, విప్రో, ఇన్ఫోసిస్ అంటూ ఏదేదో మాట్లాడుతున్నాడని, ఆయన కుటుంబసభ్యులు ఈ విషయాన్ని పరిశీలించాలని సూచించారు. తమకు రాజీనామాలు కొత్తకాదని, రేవంత్‌రెడ్డికి మోసం కొత్తకాదని పేర్కొన్నారు.

19 సార్లు ఢిల్లీకి..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 8 నెలల్లో రేవంత్‌రెడ్డి 19 సార్లు ఢిల్లీకి వెళ్లారని, ఇంకెన్నిసార్లు వెళ్తారోనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తమ పార్టీ నేతలు ప్రతి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలను పరిశీలించి రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని చెప్పారు. రుణమాఫీ సంపూర్ణంగా చేయకుంటే కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్‌ను సంస్థాగంతా బలోపేతం చేసేందుకు ఇతర పార్టీల పనితీరును అధ్యయనం చేయబోతున్నట్టు కేటీఆర్ తెలిపారు. తమిళనాడులోని డీఎంకే సహా పలు పార్టీలను అధ్యయనం చేసేందుకు సెప్టెంబర్‌లో తనతోపాటు సీనియర్ నేతలు వెళ్లనున్నట్టు చెప్పారు. అనంతరం పార్టీలో అవసరమైన మార్పులు చేస్తామని తెలిపారు. కమ్యూనిస్టులు ధృతరాష్ట్రుడి కౌగిలిలో ఉన్నారని, రైతు సమస్యలపై కలిసి వస్తానంటే వారిని కలుపుకొని వెళ్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్ రెడ్డి, తాతా మధుసూదన్, ఎమ్మెల్యే వివేకానంద, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నేత లక్ష్మీనర్సింహరావు పాల్గొన్నారు.

యథాలాపంగానే అన్నా

మహిళలపై యథాలాపంగా చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. రేవంత్‌రెడ్డికి కూడా సంస్కారం ఉంటే మహిళా శాసనసభ్యులను విమర్శించినందుకు విచారం వ్యక్తం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కాబోతున్నదంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడని తాను కూడా అంటానని పేర్కొన్నారు.

మేడ్చల్‌లో 342 మందికే రుణమాఫీ

మేడ్చల్, ఆగస్టు16(నమస్తే తెలంగాణ): మూడో విడత రుణమాఫీ జాబితాలోనూ స్థానం దక్కని రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మూడో విడతలో భాగంగా రూ.2 లక్షల వరకు రుణాలు ఉన్నవారిలో 342 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు. జిల్లాలో రుణమాఫీకి అర్హులైన రైతులు 30 వేల పైచిలుకు ఉన్నప్పటికీ, మూడు విడతల్లో కలిపి 3,436 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రుణమాఫీ పథకం కింద రూ.22 కోట్లు మాత్రమే ఇచ్చారు. దీంతో 'మేము రైతులం కాదా?' అంటూ ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గ్రీవెన్స్‌సెల్ దరఖాస్తులకు స్పందన కరువైందని రైతులు అంటున్నారు.

ఐటీ కట్టిన వారు రైతులు కాదా?

ఐటీ కడుతున్న వారికి రుణమాఫీ వర్తింపచేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఐటీ కడుతున్న వారు రైతులు కాదా? అని ప్రశ్నిస్తున్నారు. రేషన్‌కార్డులు లేని వారికి కూడా రుణమాఫీ చేయలేదన్న ఆరోపణలను ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. 3 విడతల్లోనూ రుణమాఫీ పొందని రైతులకు మరో జాబితాలోనైనా రుణమాఫీ చేస్తారో లేదో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

రేవంత్‌రెడ్డి అభినవ గోబెల్స్

- రుణమాఫీ అయితే బ్యాంకుల చుట్టూ రైతులు ఎందుకు తిరుగుతున్నరు?
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం

తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : 'రేవంత్‌రెడ్డి అభివన గోబెల్స్.. గతంలో రేవంత్ మాట్లాడినట్టుగా దిల్‌సుఖ్ నగర్‌లో విమానాలు దొరుకుతాయనేది ఎంత నిజమో.. తెలంగాణలో భాక్రానంగల్ డ్యామ్ ఎంతనిజమో.. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ కూడా అంతే నిజం.. అభినవ గోబెల్స్ అవార్డు ఇస్తే అది రేవంత్ సర్కారుకే దక్కుతుంది' అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. 31 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని చెప్పి, 17 వేల కోట్లతోనే రుణ మాఫీ అయినట్టు ప్రకటించడం విడ్డూరంగా ఉందని చెప్పారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పి మాటతప్పారని, ఆరు గ్యారెంటీలను గడువులోగా అమలుచేస్తే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు చెప్పారని, ఆ విషయాన్ని రుణమాఫీ చుట్టూ తిప్పి అరకొరగా అమలుచేసి రుణమాఫీ అయిపోయిందని దబాయిస్తూ రాజీనామా చేయాలని దుర్భాషలాడడం సరికాదని హితవుపలికారు. రుణమాఫీ పూర్తయితే రాష్ట్రంలో రైతులు ఎందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ప్రశ్నించారు. 70 లక్షల మంది రైతుల్లో 60 లక్షల మంది రుణాలు తీసుకున్నారని, ప్రభుత్వం మాత్రం 44 లక్షల మంది అని లెక్కలు చెబుతున్నదని అసలుకంటే కొసరెక్కువ అన్నట్టు రుణమాఫీపై మీడియా ప్రకటనలకే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.300 కోట్ల దాకా ఖర్చు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రైతుభరోసా ఒక్క విడతకు రూ.15 వేల కోట్లు కావాలని, అది ఎగ్గొట్టి రూ.17వేల కోట్లతో రుణమాఫీ చేసి రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. రైతు భరోసాపై క్యాబినెట్ సబ్ కమిటీ, చర్చలు, శాసనసభలో చర్చలన్నీ పక్కకు పోయాయని, జూలై 15కు నివేదిక అన్నారని, ఆగస్ట్ 15 దాటినా గతి లేదని, కనీసం కృష్ణానదిలో వృథాగా పోతున్న నీటిని ఒడిసిపట్టే తెలివి ఈ ప్రభుత్వానికి లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరు జిల్లాలో కుంటలు, చెరువులు వెలవెలబోతున్నాయని, కట్టిన రిజర్వాయర్లను నింపుకొనే సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రుణమాఫీపై బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ కు ఇప్పటి వరకు 1,11,027 వాట్సాప్ ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సీఎంకు పంపిస్తామని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ పాల్గొన్నారు.

గన్‌పార్క్ వద్ద శుక్రవారం నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

రుణమాఫీలో సీఎం విఫలం: ఎర్రోళ్ల

- గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్వీ నిరసన

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : రెండు లక్షల రుణమాఫీ చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని, ముఖ్యమంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గన్‌పార్క్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 13 హామీలు, రెండు లక్షల రుణ మాఫీ చేస్తేనే తన పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు ప్రకటించారని, ఆరు గ్యారెంటీలు ఉసేలేదని, ఇంకా 23 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరానని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రవి, అంజనేయగౌడ్, వాసుదేవరెడ్డి, భిక్షపతి, మన్నె గోవర్ధన్ రెడ్డి, గోసుల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలు, చటారి దశరథ్ పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ రాజీనామా చేయాలంటూ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో బీఆర్ఎస్ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మాఫీ కథ మళ్లీ మొదటికి?

మొదటిపేజీ తరువాయి...

ఓపిక పట్టాలని అధికారులు సూచించడంతో రైతులందరూ ఇప్పటివరకు ఎదురు చూశారు. మొదటి రెండు విడతల్లో రుణమాఫీ జరగలేదని స్పష్టంగా రైతులకు తెలిసినా.. చాలామంది ఆ విషయాన్ని మీడియాలో కానీ, సోషల్ మీడియాలో కాని పంచుకోవడానికి ముందుకు రాలేదు. ఈరోజు కాకపోతే రేపైనా మాఫీ అవుతుందన్న కోణంలో ఆలోచించి కోపాన్ని దిగమింగుకున్నారు. మూడో విడత లోనూ తమ పేర్లు లేకపోవడంతో రైతుల్లో ఆగ్రహం పెల్లుబికుతున్నది. ఇన్నాళ్లు వేచిచూసిన రైతులు ఇక ఓపిక పట్టే పరిస్థితుల్లో లేరన్న విషయాన్ని నిఘా వర్గాలు ప్రభుత్వానికి చేరవేశాయి.

మసిపూసేందుకు మరో డ్రామా..?

రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎక్కువ శాతం మందికి రుణమాఫీ జరగలేదన్న వార్తలే వస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో 40-45% మందికి, మరికొన్ని గ్రామాల్లో 50% వరకు రుణమాఫీ అయింది. దీంతో ఇన్నాళ్లు ఆశగా వేచిచూసిన రైతులు ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా పది మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం.. అందులోనూ అనేక కొర్రీలు పెట్టింది. ఉదాహరణకు అంశం నంబర్ 7ను పరిశీలిస్తే.. అసలు, వడ్డీ మొత్తం లో సరిపోలని పక్షంలో, రైతు నుంచి దరఖాస్తు తీసుకుని, వివరాలను క్లుప్తంగా పేర్కొంటూ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఆయా దరఖాస్తులను నిర్ధారణ, దిద్దుబాటు కోసం అదే బ్యాంకుకు పంపుతామని పేర్కొన్నది. ప్రభుత్వ చిత్తశుద్ధిని ఈ ఒక్క అంశంతో తేల్చవచ్చంటున్నారు నిపుణులు. లోన్ ఎంత ఉన్నదో రైతు చెప్పగలడు కానీ, వడ్డీ ఎంత ఉన్నదన్న విషయాన్ని రైతు ఎలా చెప్పగలడు? అలాగే రైతు నుంచి తీసుకున్న దరఖాస్తును తిరిగి సంబంధిత బ్యాంకుకు పంపిస్తామని పేర్కొన్నది. రైతు నుంచి దరఖాస్తును తీసుకునే బదులు.. నేరుగా బ్యాంకు నుంచి వివరాలు తెప్పించుకోవచ్చు. అయితే సాగదీసే వ్యూహంతోనే మళ్లీ దరఖాస్తుల అంకానికి తెరలేపుతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం ముమ్ముందు ఇంకా మరికొందరికి రుణమాఫీ చేస్తదన్న నమ్మకాన్ని రైతుల్లో కల్పించేందుకే ఈ మార్గదర్శకాలు జారీ చేశారనే చర్చ జరుగుతున్నది.

ఎందుకీ ఈ తతంగం?

రుణమాఫీ ప్రక్రియను గతంలో రెండుసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించింది. ఏనాడూ ఇటువంటి ఫిర్యాదులు రాలేదు. ముందుగానే అర్హులను గుర్తించి, అమలు చేసింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అర్హుల జాబితాలో కోతలు పెట్టడమే లక్ష్యంగా వ్యవహరించింది. అసలు రుణమాఫీ అర్హుల జాబితాలను ఎక్కడి నుంచి తీసుకున్నారన్న విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఇప్పుడు కూడా రుణమాఫీ కాని రైతులను అధికారుల చుట్టూ తిప్పకుండా గ్రామస్థాయిలో రుణమాఫీ కానివారితో ఒక మీటింగ్ పెట్టి... కారణాలు తెలుసుకొని అక్కడికక్కడే వివరాలను అప్‌లోడ్ చేస్తే సరిపోతుందన్న సూచనలు వస్తున్నాయి. ఆయా బ్యాంకులు, సహకార సంఘాలు రుణమాఫీ కాని రైతుల జాబితాలను తయారు చేసి పెట్టాయి. వాటి నుంచి నేరుగా డాటా తీసుకొని.. ప్రభుత్వం సదరు రైతులకు నేరుగా సమాచారం ఇచ్చి అవసరమైన పత్రాలను తెప్పించి, రుణమాఫీ చేయొచ్చు. కానీ, ఇటువంటి మార్గాలను ప్రభుత్వం అనుసరించకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

ఇవి తాజా మార్గదర్శకాలు

- మండలంలోని అన్ని బ్యాంకు శాఖలు, సహకార సంఘాలకు మండల వ్యవసాయ అధికారి బాధ్యత వహిస్తారు.
- ఫిర్యాదులను మండల వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా సీఎల్‌డబ్ల్యూ పోర్టల్ (www.clw.telangana.gov.in)లో రైతు సమాచారపత్రాన్ని యాక్సెస్ చేయాలి. సమాచారపత్రం కాపీని రైతుతో పంచుకోవాలి.
- ఆధార్ తప్పుగా ఉన్న సందర్భాల్లో ఎంఏవో తప్పనిసరిగా రైతు నుంచి ఆధార్ కార్డు కాపీని తీసుకోవాలి. పోర్టల్‌లో సరైన ఆధార్‌ను కీ చేసి కాపీని అప్‌లోడ్ చేయాలి. ఓటరుకార్డు, వాహన లైసెన్స్, రేషన్‌కార్డు వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాన్ని సేకరించి అప్‌లోడ్ చేయాలి.
- కుటుంబాలను ఇంకా నిర్ణయించని సందర్భాల్లో, ఎంఏవో తప్పనిసరిగా రైతు ఇంటికి వెళ్లి రైతు వెల్లడించిన ఆధార్ కాపీలు, కుటుంబసభ్యుల సంఖ్యను సేకరించాలి. ఆ వివరాలను పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలి.
- రైతుకు పట్టాదారు పాస్‌బుక్ లేని సందర్భాల్లో, రైతు నుంచి తీసుకున్న తర్వాత దానిని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఆధార్‌లో పేరు, లోన్ ఖాతాలో పేరు మధ్య లోపాలు లేదా తేడాలు ఉంటే రుణం తీసుకున్న వ్యక్తికి సంబంధించిన గుర్తింపును ఏర్పాటుచేయాలి. రుణం తీసుకున్న వ్యక్తికి సంబంధించి సరైన ఆధార్ నంబర్‌ను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- అసలు, వడ్డీ మొత్తంలో సరిపోలని పక్షంలో, రైతు నుంచి ఒక దరఖాస్తును తీసుకుని, వివరాలను క్లుప్తంగా పేర్కొంటూ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయొచ్చు. నిర్ధారణ, దిద్దుబాటు కోసం అదే సంబంధిత బ్యాంకుకు పంపించాలి.
- పై కార్యకలాపాల్లో పోర్టల్‌లో నవీకరణ ఉంటుంది కాబట్టి, పోర్టల్‌ను త్వరలో నవీకరించిన తర్వాత ప్రస్తుత ప్రాతినిధ్యాలు, పత్రాలను సేకరించి అప్‌లోడ్ చేయొచ్చు.
- జిల్లా వ్యవసాయ అధికారులు, అసిస్టెంట్ డివిజనల్ స్థాయి వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు సర్క్యులర్‌లోని విషయాలను జాగ్రత్తగా గమనించాలి. ఎంఏవోలు వారి సంబంధిత మండలాల్లో ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి డీఏవో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు మండలాలవారీగా ఫిర్యాదుల సంఖ్యపై రోజువారీగా నివేదికలను పంపాలి.
- వ్యవసాయ శాఖాధికారులు సమావేశాలను ఏర్పాటుచేసుకొని.. తక్షణమే ఈ మార్గదర్శకాలు అమల్లోకి వచ్చేలా, ఈ సూచనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

లోకం పోకడ

అసెంబ్లీ మీడియా హాలులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు

రుణమాఫీపై శ్వేతపత్రం ఇస్తరా?

రేవంత్‌రెడ్డీ.. జుగుప్సాకర మాటలేంది?

ప్రజలు ఉరికించి కొట్టే రోజులు దగ్గర్లోనే..

ఎమ్మెల్సీ రవీందర్‌రావు మండిపాటు

దేన్నీ అమలుచేయకుండా హరీశ్‌ను రాజీనామా అడిగే హక్కు ఎక్కడిది? : ఎమ్మెల్సీ తాతా మధు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): మహిళలకు ఇస్తామన్న రూ.2,500, రైతు భరోసా ఎకరాకు రూ.15,000, రైతు కూలీలకు ఇస్తామన్న డబ్బులు, వడ్లకు బోనస్, కల్యాణలక్ష్మి కింద ఇస్తానన్న తులం బంగారం ఏమయ్యాయని, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఇండ్ల స్థలాలు ఏవని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు నిలదీశారు. 'ముఖ్యమంత్రి హోదాలో జుగుప్సాకరంగా మాట్లాడుడేంది? రేవంత్ రెడ్డీ.. నాలుక జాగ్రత్త' అంటూ హెచ్చరించారు. వైరాలో సీఎం మాట్లాడిన మాటలు ప్రజలు సిగ్గుపడేలా ఉన్నాయని, సీఎం పదవిని దిగజార్చుతున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రజలు చెప్పుతో ఉరికించి కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మండిపడ్డారు. ముసలోళ్లను కూడా మోసగించిన రేవంత్‌ను ప్రజలు ఎలా క్షమిస్తారని ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వెళ్లి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై రేవంత్ మాట్లాడిన తీరు, భాష సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టు ప్రారంభానికి వెళ్తే రైతులనుద్దేశించి మాట్లాడాలి గాని, సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం తగదని హితవుపలికారు. 50 ఏండ్లు ప్రజాజీవితం, 14 ఏండ్లు రాష్ట్ర సాధనోద్యమం, పదేండ్లు సీఎం, 60 లక్షల సభ్యత్వం ఉన్న పార్టీని నడుపుతున్న కేసీఆర్, రాష్ట్ర ఉద్యమం నుంచి వచ్చిన కేటీఆర్, హరీశ్‌రావును ఉద్దేశించి రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడటం ఏమిటని నిలదీశారు. 'రుణమాఫీ ఎక్కడా సరిగా అమలుకాలేదు. వడ్డీలు మాత్రం కట్టించుకుంటున్నరు. 'ఎంతమంది రైతులకు రుణమాఫీ చేశారో గ్రామాలకు వెళ్లి చూద్దామా' అని సవాల్ విసిరారు. రైతుల ఖాతాల్లో ఎన్నివేల కోట్లు వేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలు తిరగబడుతరు : తాతా మధు

సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసింది కేసీఆర్ ప్రభుత్వమని, తామే చ